బాక్స్‌లోకి వెడుతూంది. పదకొండు అయ్యేసరికి బేరం జోరుగా అందుకుంది.

అదే సమయంలోనే ఓ భార్యాభర్తలు దుకాణంలోకి వచ్చారు. చీరలు తీయించారు. ఆమె ఇవి కావు అవి అంది. అవి కావు ఇవి అంది. దీని రంగు బాగులేదు. దానికి జరీ నచ్చలేదు. ఈ చీర వెడల్పు లేదు అంటూ మొత్తం షాపు షాపంతా తిరగతోడించింది. ఏది బాగులేదని చప్పరించింది. ఆమెకి చీరలు చూపిస్తున్న పని కుర్రాడు రంగడికి విసుగుతోపాటు కాస్త కోపం వచ్చింది. ఆమె ముందున్న చీరల దొంతర్లని, కుప్పకుప్పలుగా పడివున్న అన్నింటిని చూసి అవన్నీ సరిగా సర్దడానికే వక గంట పట్టిందన్న విసుగుతో "ఏమిటమ్మగారు, యిన్ని చీరలు తీయించారు. ఏది నచ్చలేదంటారు" అన్నాడు అసహనంగా.

కాస్త దూరంగా ఎవరికో సూటుగుడ్డలు, షెర్టింగ్లు చూపిస్తున్న కిషన్ రంగడి మాటలిని "ఏం కావాలంటారు వారు" అంటూ ఆ బేరం తమ్ముడి కప్పగించి చీరలువైపు నడిచాడు. "ఏమిటి మేడమ్, ఏం కావాలి బెనారస్, కంజీవరం, ధర్మవరం, మైసూర్ సిల్క్, జపాన్ సిల్కు, షిపాన్, నైలాన్‌జార్జట్, క్రేప్, కలిసింథ్ .... అన్నీ వున్నాయి ఏం కావాలి ?" అంటూ ఓ డజను పేర్లు గడగడ చదివాడు.

"ప్చ్. ఏం బాగులేవు. అన్నీ ఓల్డు పాషన్, పాత స్టాకే .... క్రొత్త వెరైటి ఏం లేదే ? వీటిల్లో" అంటూ ఆమె చప్పరించింది.

"ఈ కాలిసింథ్ క్రొత్త డిజైనులు చూడండి. ఈ జపాను సిల్కు బంగీ మొన్ననే విప్పాం. కంజీవరంనించి మొన్ననే తెచ్చాం యీ చీరలు. ఇవన్నీ ఇప్పటివే పాతవికావు మేడమ్, ఒరేయ్‌రంగా నిన్నవచ్చిన బంగిలో షిపాన్, జార్జెట్ పట్రారా...." అన్నాడు కిషన్. చీరలు సర్రునవిప్పి, ఆమె ముందు ఒక్కొక్కటీ పడేస్తూ వాటి గుణ విశేషాణాలు అప్పచెప్ప సాగాడు. కష్టమర్లని అంత సుళువుగా వదులుకోడం అతని కిష్టంలేదు. తండ్రి దగ్గిర వ్యాపార దక్షత, మెళకువలు బాగా నేర్చుకున్న కిషన్ కష్టమర్లని ఎలా ఆకట్టుకోవాలో, వాళ్ళు షాపంతా తిరగతోడించినా

ఛర్రున లాగి మరికొన్ని చీరలు తీశాడు. చీరలన్నీ విసురుగా విప్పి కుప్పలా పోసేస్తున్నాడు. "అమ్మా .... మీరు ఈ వూరంతా తిరిగినా యింతకంటె మంచి చీరలు ఏ షాపులోనన్నా దొరికితే మా షాపు మూసేస్తాం, వ్యాపారం ఎత్తేస్తాం, ఇన్ని రకాల చీరలు మా షాపులో కాక మరెక్కడమ్మా దొరికేది. ఎర్రబడ్డ మొహంతో సవాల్ చేశాడు. మూర్తి షాపువాడి చిరాకును గమనించాడు. ఇంకా వూరుకుంటే మర్యాద పోతుందని "రమా, వాటిల్లో ఏదో ఒకటి తీసుకుని త్వరగా రా! ఇంక చాలు ఎంచడం" అన్నాడు కఠినంగా.

"అయినా యింటిదగ్గిర ఏం చీరలు కావాలో, ఎంత ఖరీదులో కావాలో అన్నీ నిర్ణయించుకోకుండా ఇక్కడికొచ్చి అన్నీ తీయించడం వాళ్ళని బాధ పెట్టడం ఏమిటి? ఏమిటి కొనేమాటయితే కొను లేకపోతే పద వెంటనే.

కిషన్ కాస్త శంకించి "ఫర్వాలేదు సార్! అమ్మగారికి నచ్చితేనే తీసుకోమనండి. మా షాపులోనే నచ్చకపోతే మరెక్కడా నచ్చవు అన్నా అంతే, మా కిది అలవాటే సార్! లేకపోతే వ్యాపారం ఎలా చేస్తాం" అన్నాడు. కుర్రాళ్ళు చీరలు మడతలు పెడ్తున్నారు. అన్నీ తీయించి ఏదో ఒకటి కొనకపోతే బాగుండదని, ముఖ్యంగా భర్త కేకలేస్తాడని, తప్పక అసంతృప్తిగానే ఓ చీర తీసింది రమ.

"హమ్మయ్య" అన్నాడు మూర్తి. కిషన్, కుర్రాడు లోపలను కున్నారు, ఆ మాట.

చీర ప్యాక్ చేయించి, నూరు రూపాయలు బిల్లు చెల్లించి బయటికి నడిచారు ఇద్దరూ.

"భలే బేరం సార్" అన్నాడు రంగడు చీరలు సర్దుతూ. కిషన్ చీరలకుప్పల మధ్యనించి చీరలు తీస్తూ అదోలా నవ్వాడు కళ్ళెగరేసి రంగడిని చూసి. రంగడు ఆశ్చర్యంగా చూశాడు, షాపు వెనకాల ఇంట్లో కెడుతున్న కిషన్‌ని.

